దరఖాస్తులు అడిగితే అవమానిస్తున్నారు!

హత్నూర, నవంబర్ 17: ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ కులగణన సర్వేకోసం దరఖాస్తు ఫారం అడిగితే అధికారులు దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఎస్‌జీటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల ప్రభాకర్ ఆరోపించారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన కులగణన కార్యక్రమంలో ఉపాధ్యాయులకు సర్వే పని అప్పగించినప్పటికీ ప్రభుత్వం సరిపోను దరఖాస్తు ఫారాలు అందజేయకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తున్నదన్నారు. న్యాల్‌కల్ మండలం చాల్కిలో సర్వేచేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు శంకర్ సర్వే దరఖాస్తు ఫారం కావాలని ఎంపీవో సురేశ్‌ను అడిగితే దురుసుగా ప్రవర్తించడంతోపాటు బెదిరింపులకు పాల్పడ్డట్లు ఆరోపించారు. రికార్డులు సక్రమంగా రాయడానికి రాదు, ఏమి చదువుకున్నావు, ఉద్యోగం ఎలా వచ్చిందని కించపరిచేవిధంగా మాట్లాడినట్లు ఆరోపించారు. ఓవైపు పాఠశాలలో విధులు నిర్వహిస్తూ మరోవైపు సర్వే చేస్తున్న ఉపాధ్యాయుల పట్ల ఉన్నతాధికారులు బెదిరింపులకు పాల్పడటం బాధాకరమన్నారు. ఒక్కో ఉపాధ్యాయునికి 180 వరకు కుటుంబాల సర్వే పనులు అప్పగిస్తూ పని భారం పెంచడమేకాకుండా ఉపాధ్యాయుల పట్ల చిన్నచూపు చూడటం తగదన్నారు. సర్వే నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని టార్గెట్ పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేసి పనిభారం తగ్గించాలని కోరారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

మాట్లాడుతున్న రాష్ట్ర రజక సంఘం అధ్యక్షుడు గోపి

వట్‌పల్లి, నవంబర్ 17: రజకులకు ఎస్సీ జాబితాలో చేర్చాలని రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపి, మండల అధ్యక్షుడు బస్వరాజు కోరారు. మండల కేంద్రంలో ఆదివారం మండల స్థాయి రజకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ఒకే కుల వృత్తి చేసుకొని జీవించే దోబీలకు ఎస్సీ రిజర్వేషన్ అవకాశాన్ని కల్పించాలన్నారు. 2018 ఎన్నికల సమయంలో బీజేపీ మ్యానిఫెస్టోలో అధికారంలోకి వస్తే రజకులను ఎస్సీ జాబితాలో చేర్చుతామన్నారన్నారు. 2016 డిసెంబర్ 26న అసెంబ్లీలో మాట్లాడిన రేవంత్ రెడ్డి ప్రస్తుతం తెలంగాణ ముఖ్యమంత్రిగా ఉన్నా ఎందుకు ఆ దిశగా అడుగులు వేయడం లేదో రజక కులస్తులకు సమాధానం చెప్పాలన్నారు. సమావేశంలో రాష్ట్ర యూత్ ఉపాధ్యక్షుడు యాదయ్య, నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి బస్వరాజ్, మండల అధ్యక్షురాలు పుష్పలత, విద్యార్థి విభాగం అధ్యక్షుడు బస్వరాజ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుమార్, అశోక్ పాల్గొన్నారు.

మల్లన్న జాతరను విజయవంతం చేయాలి

జాతర ఏర్పాట్లపై చర్చిస్తున్న గ్రామస్తులు

జహీరాబాద్, నవంబర్ 17: న్యాల్‌కల్ మండలంలోని మల్గి శివారులోని మల్లన్నస్వామి జాతరను విజయవంతం చేయాలని ఆలయ నిర్వాహకులు, మాజీ సర్పంచ్‌లు భూమారెడ్డి, మారుతీయాదవ్ కోరారు. ఆదివారం గ్రామంలో మల్లన్న స్వామి జాతర ఏర్పాట్లపై నిర్వాహకులు, కమిటీ సభ్యులు, గ్రామస్తులతో కలిసి సమావేశం నిర్వహించారు. డిసెంబర్ 7 నుంచి 15 వరకు స్వామివారి ఉత్సవాలు జరగనున్నాయన్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామివారి దర్శనం నిమిత్తం వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. డిసెంబర్ 7న స్వామివారికి అభిషేకం, హారతి, లగ్నం, భజన కీర్తనలు, 14వ తేదీన బోనాల ఊరేగింపు, 15న పల్లకీ ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. స్వామివారి జాతరను విజయవంతం చేసేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. సమావేశంలో నాయకులు సిధారెడ్డి, శివానంద, శ్రీపాతి, రాజు, దశరథ్, ఆలయ కమిటీ సభ్యులు వైజ్యనాథ్, ప్రతాప్‌రెడ్డి, మహేశ్, బాలాజీగౌడ్ పాల్గొన్నారు.

సందడిగా సదర్

సదర్‌లో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చింతా సాయినాథ్

సదాశివపేట, నవంబర్ 17: పట్టణంలోని శ్రీకృష్ణ నగర్ కాలనీలో శనివారం రాత్రి లడ్డూ యాదవ్ ఆధ్వర్యంలో సదర్ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చింతా సాయినాథ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కోడూరి రమేశ్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుడు నాగుల విజయ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సదర్ సమ్మేళనాన్ని నిర్వహించిన యాదవ సంఘం సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా దున్నపోతులతో చేయించిన నృత్యాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో నాయకులు విజయ్‌యాదవ్, మంబిగారి అంజనేయులు, నాగరాజు, నాసర్, అప్పి, అరుణ్, వాజిద్, గణేష్, ఫారూఖ్, అక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలి

బైకులు అడ్డంగా పెట్టి సీరూర్ గ్రామస్తుల నిరసన

సీరూర్ ప్రధాన రోడ్డుపై బైక్‌లు, చెట్ల కొమ్మలు అడ్డంగా పెట్టి నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

రాయికోడ్, నవంబర్ 17: మండల పరిధిలోని సీరూర్ గ్రామ శివారులో రోడ్డు పనులు మొదలుపెట్టి నెలలు గడుస్తున్నా పనులు పూర్తి చేయడం లేదని సీరూర్ గ్రామ ప్రజలు ఆదివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలోని మహిబాత్‌పూర్ నుంచి సీరూర్ గ్రామ శివారులో ఉన్న మంజీరా నది వరకు వేస్తున్న రోడ్డు పనులు పూర్తి కాకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని, గతంలో రోడ్డుపై పోసిన మట్టి, దుమ్ము వ్యవసాయ పొలాల్లోకి, సీరూర్ గ్రామంలో ఇండ్లు, దుకాణాలు, హోటళ్లలోకి చేరుతున్నదన్నారు. గ్రామస్తుల నిరసనతో ప్రధాన రోడ్డుపై వాహనాలు నిలిచిపోయాయి. జహీరాబాద్ రూరల్ సీఐ హనుమంత్ ఘటనా స్థలానికి చేరుకొని గ్రామస్తులతో మాట్లాడారు. ఈ విషయంపై సీఐ సంబంధిత శాఖ అధికారులకు సమాచారం అందించారు. అధికారులు త్వరలోనే రోడ్డు పనులు పూర్తి చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

రామకృష్ణకు టీచర్ ప్రేరణ పురస్కారం

టీచర్ ఇన్స్పిరేషన్ 2024 పురస్కారం అందుకుంటున్న రామకృష్ణ

సదాశివపేట, నవంబర్ 17: హైదరాబాద్ బీఎం బిర్లా సైన్స్ సెంటర్‌లోని భాస్కర ఆడిటోరియంలో శారద ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం టీచర్స్ ప్రేరణ 2024 పురస్కారాలను ప్రదానం చేశారు. సదాశివపేట మండల పరిధిలోని నిజాంపూర్(కె) పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పోట్రు రామకృష్ణ టీచర్ ప్రేరణ పురస్కారాన్ని శాతవాహన యూనివర్సిటీ వైస్ చైర్మన్ ఉమేశ్‌కుమార్, రోబోటిక్ సీఈవో మనీష్ జిందాల్ చేతుల మీదుగా అందుకున్నారు. పాఠశాల నిర్వహణ, వినూత్న బోధన, సామాజిక సేవలకుగాను ఈ పురస్కారం రామకృష్ణకు ప్రదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో శారద ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ పట్నం కమల మనోహర్, డాక్టర్ సాహిత్యవల్లి, నక్క శ్రీనివాస్, పట్నం సుజాత, తోట ప్రవీన నాయుడు, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

మాట్లాడుతున్న సాంఘిక సంక్షేమ సహాయాధికారి చంద శ్రీనివాస్

ఝరాసంగం, నవంబర్ 17: ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని, విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని సాంఘిక సంక్షేమ సహాయాధికారి చంద శ్రీనివాస్ ఆకాంక్షించారు. గతంలో ఝరాసంగంలో కేంద్రియ విద్యాలయంగా కొనసాగిన పాఠశాల ఖాళీ కావడంతో ప్రభుత్వం దానిని ఎస్సీ బాలికల వసతి గృహానికి కేటాయించిన సందర్భంగా ఆదివారం పూజలు నిర్వహించి విద్యార్థులను నూతన వసతి గృహంలోకి పంపించారు. అనంతరం విద్యార్థులకు వడ్డించిన భోజనాన్ని పరిశీలించి, మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందిస్తూ సొంత పిల్లల్లా చూసుకోవాలని హాస్టల్ వార్డెన్‌కు సూచించారు. విద్యార్థులకు భోజనం, స్వచ్ఛమైన తాగునీరు అందించాలని, పరిసరాలతోపాటు మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచుకోవాలని హాస్టల్ సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హనుమంత్‌రావు పటేల్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకటేశం, సీపీఎం మండల అధ్యక్షుడు చంద్రన్న, సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు జగదీశ్వర్, ఎస్సీ బాలుర, బాలికల వార్డెన్లు వెంకటేశం, చంద్రమ్మ, నాయకులు రుద్రప్ప పటేల్ పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు చేరిన పాప

తప్పిపోయిన పాపను తల్లిదండ్రులకు అప్పగించిన జహీరాబాద్ పోలీసులు

జహీరాబాద్, నవంబర్ 17: ఇంట్లో నుంచి బయటకు వచ్చి తప్పిపోయిన రెండేళ్ల పాపను జహీరాబాద్ పట్టణ పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. జహీరాబాద్ పట్టణ ఎస్‌ఐ కాశీనాథ్ కథనం ప్రకారం.. ఆదివారం ఉదయం పట్టణంలోని రాచన్నపేట్ వార్డులోని భాగారెడ్డిపల్లికి వెళ్లేదారిలోని బ్రిడ్జి సమీపంలో రెండేళ్ల పాప ఏడుస్తూ ఒంటరిగా కనిపించింది. ఆ మార్గం గుండా వెళ్తున్న కొందరు పాపను చూసి తమకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు అక్కడకు చేరుకొని పాపను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. పాప ఫొటోను వాట్సాప్ ద్వారా పంపించడంతో సమాచారం తెలుసుకున్న జహీరాబాద్ పట్టణంలోని శాంతినగర్ వార్డులో నివాసం ఉంటున్న తల్లిదండ్రులు సునీత, లోకేశ్‌పవర్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. పూర్తి వివరాలను పరిశీలించిన తర్వాత పోలీసులు పాపను తల్లిదండ్రులకు అప్పగించారు. పిల్లల పట్ల అప్రమత్తంగా ఉం డాలని పోలీసులు తల్లిదండ్రులకు సూచించారు. పాపను సురక్షితంగా అప్పగించినందుకు పాప తల్లిదండ్రులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్‌గా రాజారెడ్డి

జిన్నారం, నవంబర్ 17: టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్‌గా కె.రాజారెడ్డి మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాజారెడ్డి గుమ్మడిదల మండలం నల్లవల్లి ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. సంగారెడ్డిలో జరిగిన ఈ ఎన్నికలో రాజారెడ్డి టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్‌గా, బొల్లారం ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఏఎం ఆనందం టీపీటీఎఫ్ జిల్లా అకడమిక్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత టీపీటీఎఫ్ మొదటి జిల్లా అధ్యక్షుడిగా పని చేసిన రాజారెడ్డి ఆ తర్వాత వరుసగా ఎన్నికవుతున్నారు. ఈ సందర్భంగా ఆయన జిన్నారంలో విలేకరులతో మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం ఉద్యోగ, ఉపాధ్యాయులకు నాలుగు విడతలుగా బకాయి ఉన్న డీఏ, పీఆర్సీలను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న జీపీఎఫ్, సరెండర్ లీవ్ బిల్లులు వెంటనే చెల్లించాలని కోరారు.

వీరభద్రస్వామి ఆలయంలో కార్తిక సందడి

వీరభద్రస్వామిదేవాలయ ప్రాంగణంలో కార్తిక దీపాలను వెలిగిస్తున్న భక్తులు

గుమ్మడిదల, నవంబర్ 17: ప్రసిద్ధ శైవ క్షేత్రమైన బొంతపల్లి భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో కార్తిక మాస పూజలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. మండలంలోని వీరన్నగూడెంలోని వీరభద్రస్వామి ఆలయంలో ఆదివారం సెలవు రోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో దైవదర్శనాలకు హాజరయ్యారు. క్యూలో నిలబడి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు కార్తిక దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. వీరభద్రస్వామి వారికి అభిషేకాలు, భద్రకాళీ అమ్మవారికి కుంకుమార్చనలు, సామూహికంగా సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. ఈవో శశిధర్‌గుప్తా, జూనియర్ అసిస్టెంట్ సోమయ్య ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

సిమెంట్ బెంచీల అందజేత

బెంచీలను అందజేస్తున్న కుటుంబ సభ్యులు

జహీరాబాద్, నవంబర్ 17: న్యాల్‌కల్ మండలంలోని మల్గి గ్రామంలో ప్రజల సౌకర్యార్థం సిమెంట్ బెంచీలను ఆదివారం అందజేసినట్టు బీఆర్‌ఎస్వీ మండల అధ్యక్షుడు, గ్రామ మాజీ సర్పంచ్ మారుతీయాదవ్ తెలిపారు. గ్రామ వార్డు మాజీ సభ్యుడు, దివంగత మహాదేవి 7వ వర్ధంతిని పురస్కరించుకొని ప్రజల సౌకర్యార్థం రూ.18 వేల ఖర్చుతో ఏడు సిమెంట్ బెంచీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నానమ్మ మహాదేవి జ్ఞాపకార్థం గ్రామంలోని పలు వార్డుల్లోని ఆలయాలు, ప్రధాన చౌరస్తాలో ప్రజల సౌకర్యార్థం బెంచీలను అందజేసినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు వినోద్, దత్తు, మారుతి, నగేశ్, సునీల్, మహేశ్, సాయినాథ్, మహాదేవి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి బాసట

ఆర్థికసాయం, నిత్యవసర సరుకులు అందజేస్తున్న అబ్దుల్ ఖదీర్

రామచంద్రాపురం, నవంబర్ 17: పేద కుటుంబానికి ఏకే ఫౌండేషన్ బాసటగా నిలిచింది. ఆర్సీపురం డివిజన్‌లోని అశోక్‌నగర్‌కు చెందిన ఫిరోజ్ కుడిచేయికి ఇన్ఫెక్షన్ కావడంతో ఆ చేయిని వైద్యులు తొలగించారు. అప్పటినుంచి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ఆ కుటుంబానికి ఏకే ఫౌండేషన్ చైర్మన్ అబ్దుల్ ఖాదీర్ అండగా నిలిచారు. ఫిరోజ్ కుటుంబానికి నిత్యావసర సరుకులు అందించడంతోపాటు వైద్యం కోసం ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో శివకుమార్ తదితరులు ఉన్నారు.

విశ్వశాంతికి మృత్యుంజయ యజ్ఞం

మృత్యుంజయ యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

ఝరాసంగం, నవంబర్ 17: ధర్మ రక్షణ, విశ్వశాంతి, లోక కల్యాణార్థం మృత్యుంజయ మహాయజ్ఞాన్ని నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ పీఠాధిపతులు అవధూత గిరి మహారాజ్, సిద్దేశ్వరానందగిరి మహారాజ్ పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని బర్దిపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలోని యజ్ఞశాలలో మృత్యుంజయ మంత్ర సహస్ర మహాయజ్ఞం విశ్వ మానవ ధర్మ ప్రచార సంఘం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ యజ్ఞానికి సంగారెడ్డి, జహీరాబాద్, నారాయణఖేడ్, కర్ణాటకలోని బీదర్, నుంచి భక్తులు హాజరయ్యారు. ఉదయం గణపతి పూజతో ప్రారంభమైన యజ్ఞం పూర్ణాహుతి, మహామంగళహారతితో ముగిసింది. దత్తగిరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

విజేతలకు బహుమతుల అందజేత

బహుమతులు అందజేస్తున్న ఏఈ మహేశ్

జహీరాబాద్, నవంబర్ 17: జహీరాబాద్ పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో బాల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీలు ఆదివారం ఉత్సాహంగా జరిగాయి. పట్టణంలోని డీ ఎరీనా ఇండోర్ స్టేడియంలో బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ఆర్గనైజర్ డప్పూర్ నిఖిల్ ఆధ్వర్యంలో క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలుగా ఫిరోజ్-సందీప్, రన్నర్‌గా పవన్-అభిషేక్ నిలిచారు. మూడో విజేతగా దుర్గాప్రసాద్-హనుమండ్లు విజయం సాధించారు. విజేతలుగా నిలిచిన క్రీడకారులకు మహమ్మద్ ఇక్బాల్, ట్రాన్స్‌కో ఏఈ కొండ్లి మహేశ్, డాక్టర్ సంతోష్ బహుమతులు ప్రదానం చేశారు.

రేజింతల్ సిద్ది వినాయకుడు

నేడు సంకష్ట హర చతుర్థి

జహీరాబాద్, నవంబర్ 17: నియోజకవర్గంలోని న్యాల్‌కల్ మండల పరిధిలోని రేజింతల్, హద్నూర్, చీకూర్తి గ్రామాల్లోని సిద్ధి, వర సిద్ధి వినాయక ఆలయాల్లో కార్తిక సోమవారంతో పాటు సంకష్టహర చతుర్థి వేడుకలకు ఏర్పాట్లను పూర్తి చేసినట్టు స్థానిక ఆలయాల ట్రస్టు సభ్యులు, నిర్వాహకులు తెలిపారు. ఈ వేడుకలకు తెలంగాణ నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల భక్తులు హాజరుకానున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

అంత్యక్రియలకు తక్షణసాయం

కోహీర్, నవంబర్ 17: మండలంలోని పీచెర్యాగడి తండా(ఏ)కు చెందిన దేవసోత్ దశరథ్, దేవసోత్ కమలిబాయి కుమారుడు దేవసోత్ శ్రీను(24) ఆదివారం ఉదయం మృతిచెందాడు. సజ్జాపూర్ గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త ప్రసాద్‌రెడ్డి బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. శ్రీను అంత్యక్రియల నిమిత్తం బాధిత కుటుంబానికి రూ.10వేలు తక్షణసాయం అందించారు. పేద గిరిజన యువకుడి అంత్యక్రియలకు ఆర్థికసాయం అందించిందుకు ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు వినోద్‌రాథోడ్, తదితరులు ఆయనను అభినందించారు.

కాల్వను మూసివేస్తే చర్యలు

కోహీర్, నవంబర్ 17: చెక్ డ్యామ్‌లోకి వర్షపు నీరు రాకుండా కాల్వను మళ్లిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నీటిపారుదల శాఖ ఏఈ రవీందర్ హెచ్చరించారు. ఆదివారం మండలంలోని కొత్తూర్(డి) గ్రామ దర్గా సమీపంలో కాల్వ మూసివేత కోసం చేపట్టిన పనులను ఆయన నిలిపివేయించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ చెక్ డ్యామ్‌లోకి వచ్చే నీటికి అడ్డంకులు సృష్టించొద్దని రైతుకు సూచించారు. పట్టా భూమి అయినా కూడా నీటి కాల్వ మార్గం మార్చొద్దన్నారు. కాల్వను మూసివేస్తే కేసు నమోదు చేయిస్తామని హెచ్చరించారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి

చౌటకూర్, నవంబర్ 17: గుండెపోటుకు గురై ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి చెందాడు. మండలంలోని శివంపేట గ్రామానికి చెందిన చాక్లెట్ భాస్కర్(47) ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ సంగారెడ్డిలో నివాసముంటున్నాడు. ఎప్పటిలాగే శనివారం విధులకు వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చారు. ఆకస్మాతుగా గుండెపోటు రావడంతో ఇంట్లోనే మృతి చెందారు. 2002 డీఎస్సీలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. అందోలు మండలం కన్సానిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ ఇటీవల జరిగిన బదిలీల్లో స్కూల్ అసిస్టెంట్(హిందీ)గా పదోన్నతి పొంది హత్నూర మండలం సిరిపురం జడ్పీహెచ్‌ఎస్‌కు బదిలీ అయ్యారు. మృతుడికి భార్య ధనలక్ష్మి, కుమారుడు, కూతురు ఉన్నారు. ఉపాధ్యాయుడు భాస్కర్ అకాల మరణం పట్ల పీఆర్టీయూ టీఎస్, టీపీటీఎఫ్ నాయకులు బాధిత కుటుంబానికి సానుభూతి తెలిపి సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం జరిగిన అంత్యక్రియలకు సహచర ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల యూనియన్ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

శాంతినగర్‌లో చైన్‌స్నాచింగ్

పటాన్‌చెరు, నవంబర్ 17: తెల్లవారుజామున ఆరుగంటల ప్రాంతంలో తులసి చెట్టుకు పూజ చేస్తున్న వృద్ధురాలి మెడలోని పుస్తెలతాడును దొంగలు లాక్కెళ్లిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. శాంతినగర్ కాలనీలో ఉదయం తులసిచెట్టుకు పూజ చేస్తున్న శ్రీపాద సోమలక్ష్మి(80) వద్దకు ఇద్దరు దొంగలు అతివేగంగా వచ్చి మెడలోని నాలుగు తులాల బంగారు పుస్తెలతాడును లాక్కెళ్లారు. ఒకరు హెల్మెట్ ధరించి ఉండగా, మరొకడు మాస్క్ పెట్టుకొని ఉన్నాడు. ఇద్దరు ముందుగానే బైక్‌పై ఇంటిముందు రెక్కీ నిర్వహించి తిరిగొచ్చి పుస్తెలతాడును లాక్కెళ్లినట్లుగా సోమలక్ష్మి కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పటాన్‌చెరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.

కొడకంచిలో మట్టి అక్రమ తవ్వకాలు

జిన్నారం, నవంబర్ 17: కొడకంచి పరిధిలోని డెక్కన్ ఆటో పరిశ్రమ సమీపంలోని ప్రభుత్వ భూమిలో నుంచి రాత్రిపూట మట్టి అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని గ్రామస్తులు తెలిపారు. జేసీబీలతో మట్టి తవ్వి టిప్పర్ల ద్వారా ఇంద్రేశం గ్రామానికి తరలిస్తున్నారని చెప్పారు. ఇప్పటివరకు వందల ట్రిప్పుల మట్టిని తరలించారని, అధికారులు రాత్రిళ్లు నిఘా ఏర్పాటు చేసి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

క్షేమంగా అదృశ్యమైన ఆదర్శ పాఠశాల విద్యార్థులు

బొల్లారం, నవంబర్ 17: అదృశ్యమైన ముగ్గురు విద్యార్థులు క్షేమంగా ఉన్నారు. బొల్లారం మున్సిపాలిటీలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న మనోజ్ కుమార్, అఖిల్, మల్లికార్జున్ శనివారం మధ్యాహ్నం పాఠశాల నుంచి కనిపించకుండా పోయిన విషయం తెలిసిందే. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల ప్రిన్సిపాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీరంతా చార్మినార్ సమీపంలో ఉన్నట్లు సమాచారం తెలుసుకున్న పోలీసులు విద్యార్థులను క్షేమంగా తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

భక్తిశ్రద్ధలతో చండీ హోమం

చండీ హోమంలో మున్సిపల్ చైర్ పర్సన్ రోజారాణి

బొల్లారం, నవంబర్ 17: బొల్లారం మున్సిపల్ పరిధిలోని భవానీ శంకర ఆలయ సప్తమ వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం రెండో రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు నాగార్జున చార్యుల ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణితోపాటు మాజీ ఎంపీపీ రవీందర్ రెడ్డి దంపతులు చండీ హోమంలో పాల్గొన్నారు. అనంతరం భక్తుల సమక్షంలో స్వామివారి ఎదుర్కోళోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భవానీ శంకరులను దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళా భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ

జిన్నారం, నవంబర్ 17: మండలంలోని ఊట్ల గ్రామంలో అయ్యప్ప పడిపూజ వైభవంగా జరిగింది. బుషిగారి శ్రీశైలం స్వామి శనివారం రాత్రి అయ్యప్ప పడిపూజ నిర్వహించారు. శ్రీకాంత్ కులకర్ణి ఆధ్వర్యంలో జరిగిన పూజకు ఊట్ల అయ్యా ప్ప ఆలయ సన్నిదానం స్వాములతోపాటు మంగంపేట, జిన్నారం, గడ్డపోతారం, నల్లూరు గ్రామాల నుంచి అయ్యప్ప స్వాములు హాజరయ్యారు. సోలక్‌పల్లి గ్రామానికి చెందిన రాఘువేందర్ ఆలపించిన భక్తి గీతాలు అందరిని అలరించాయి.

ఘనంగా 'గ్యార్మీ'

బొల్లారం, నవంబర్ 17: బొల్లారం మున్సిపాలిటీలోని బీసీ కాలనీలో హజ్రత్ గౌస్ అజామ్ దస్తగిర్ దర్గాలో గ్యార్మీ ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఉత్సవాల్లో కాంగ్రెస్ సీనియర్ నేత, కౌన్సిలర్ చంద్రారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రార్థనలు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు కౌన్సిలర్ చంద్రారెడ్డిని ఘనంగా సన్మానించారు. నాయకులు సంపత్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రాజు, గౌస్, ఫాసీల్, ఖదీర్, అఫ్రోజ్, స్థానికులు పాల్గొన్నారు.

సర్వేలో తప్పులు జరగొద్దు

ఝరాసంగం, నవంబర్ 17: కుటుంబ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి వంటి అంశాలను దరఖాస్తు ఫారంలో తప్పులు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో సుధాకర్ సర్వే సిబ్బందికి సూచించారు. ఆదివారం మండల పరిధిలోని బర్దిపూర్, పొట్టిపల్లి, ఎల్గోయి గ్రామాల్లో సర్వే జరుగుతున్న తీరును, నమోదు చేస్తున్న వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎపీవో రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

సజావుగా గ్రూప్ - 3

గ్రూప్- 3 పరీక్షలు ఆదివారం సజావుగా ప్రారంభమయ్యాయి. పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం 9.30 గంటలకే గేట్లు మూసివేశారు. పూర్తిగా తనిఖీ చేసిన తర్వాతే అభ్యర్థులను లోనికి అనుమతించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 49 పరీక్ష కేంద్రాల్లో మొదటి రోజు పరీక్ష ప్రశాంతంగా జరిగింది. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు.

- నమస్తే తెలంగాణ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి, నవంబర్ 17



సంగారెడ్డిలోని సెయింట్ ఆంథోనీ పాఠశాల కేంద్రంలో అభ్యర్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

పరీక్ష కేంద్రానికి వస్తున్న అభ్యర్థి